

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా!
వేసవి సెలవుల్లో సరదాగా ఈతకు వెళ్తున్న చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. 10 నుంచి 15ఏళ్ల లోపు పిల్లలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. - 8లో▸



కేయూను సందర్శించిన న్యాక్ టీం
న్యాక్ టీం సభ్యులు గురువారం కేయూలోని పలు విభాగాలు, కళాశాలలను సందర్శించి పరిశీలించారు. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
44.4^0 / 29.0^0
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగత్రలు నమోదు అవుతాయి. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహబూబాబాద్‌: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌ అన్నారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్‌ సమన్యాయం చేస్తున్నారన్నారు. బంగారు తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్‌ ముందుకు పోతున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. 87మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్‌ ఇమ్మానియేల్‌, మార్నేని వెంకన్న, గద్దె రవి, రాజు, అశోక్‌, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌, రెడ్యా, రఫిక్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధురాలి మృతి



కురవి: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధురాలు గంగరబోయిన చంద్రమ్మ(90) అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో గురువారం మృతి చెందింది. సమరయోధురాలు గంగరబోయిన చంద్రమ్మ భర్త భద్రయ్య ప్రముఖ సీపీఐ నేత, సమరయోధుడు గత కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. చంద్రమ్మ కొన్ని రోజుల నుంచి అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. శుక్రవారం కురవిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

‘డబుల్‌’ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



గార్ల: మండలంలోని ముల్కనూరు జీపీలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్‌ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేసి అర్హులైన పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్ల నుంచి ముల్కనూరు పంచాయతీ గుంపెళ్లగూడెం గ్రామంలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పనులు సాగడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టి అర్హులకు అందించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, కృష్ణమూర్తి, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్‌ అర్బన్‌: మహబూబాబాద్‌లోని కిసాన్‌ పరివార్‌ ప్రైవేట్‌ సంస్థలో పనిచేయడానికి ఆసక్తి గల గ్రామీణ ప్రాంత యువత డీఆర్‌డీఏ, ఈజీఎంఎం ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10గంటలకు సోషల్‌ వెల్ఫేర్‌ పాఠశాలలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 83282 65892, 85220 54266 నంబర్లలో సంప్రదించాలని, సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

విద్యారణ్యపురి: కేజీబీవీల టీచర్ల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్‌ హనుమకొండ, వరంగల్‌ జిల్లా శాఖల ఆధ్వర్యంలో గురువారం వివిధ జిల్లాల కేజీబీవీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. హనుమకొండ మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన ఈసమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేజీబీవీ టీచర్లకు భవిష్యత్‌లో సీఎం సహకారంతో మినిమమ్‌ టైం స్కేల్‌ ఇప్పించనున్నట్లు హామీ ఇచ్చారు. సమావేశంలో తిరుపతిరెడ్డి, శ్రీహరి, పట్టాభి, భాను ప్రసాద్‌ రెడ్డి, అబ్దుల్‌ గఫార్‌ తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలు కరువు

- మూలన పడిన టెస్ట్‌ కిట్లు
- రసాయనాలు అందించడంలో విఫలం
- మూస పద్ధతిలో పంటల సాగు
- తగ్గిన సేంద్రియ ఎరువుల వాడకం
- దిగుబడి లేక రైతన్న దిగాలు





సాక్షి, మహబూబాబాద్‌: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించి రైతుల లాభం పొందవచ్చు. అయితే జిల్లాలో భూసార పరీక్షలు చేయడం లేదు. రసాయనాలు అందుబాటులో లేకపోవడంతో పరీక్షలు నిర్వహించడం లేదు. దీంతో రైతులు మూసపద్ధతిలో పంటలు సాగు చేస్తుండడంతో.. చీడపీడల బారిన పడి దిగుబడులు తగ్గుతున్నాయి. ఇదిలా ఉండగా కనీసం పంటల సాగు, ఎరువుల వాడకంపై కూడా రైతులకు అవగాహన కల్పించే అధికారులు జిల్లాలో కరువయ్యారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు.



జిల్లా భౌగోళిక విస్తీర్ణం:	8,48,983 ఎకరాలు
మొత్తం సాగు విస్తీర్ణం :	4,60,655
రెవెన్యూ గ్రామాలు:	288
వ్యవసాయ డివిజన్లు:	2
వ్యవసాయ క్లస్టర్లు:	82

పరీక్షలు చేసే వారేరి..

వ్యవసాయాన్ని పండుగ చేస్తాం.. అని చెప్పిన పాలకులు, అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కాగా మూసపద్ధతి సాగుకు స్వస్తి చెప్పి అధునాతన వ్యవసాయం వైపు రైతులను మళ్లించి.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం దూర దృష్టితో ఆలోచించింది. ఈమేరకు ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా లెక్కించి జిల్లాలో క్లస్టర్లు ఏర్పాటు చేసింది. 2018లో రైతులకు సేవలు అందించేందుకు ఒక్కో క్లస్టర్‌కు ఒక ఏఈఓ(వ్యవసాయ విస్తరణ అధికారి)ను నియమించింది. భూసార పరీక్షలు చేసేందుకు వీరికి కిట్లు కూడా అందజేశారు. వీటిద్వారా ప్రధాన పోషక విలువలు నత్రజని, భాస్వరం, పొటాష్‌, పీహెచ్‌సీ, ఈసీ(నేల సామర్థ్య పరీక్ష) నిర్వహించేందుకు కెమికల్స్‌తో పాటు, జల్లెడ, ఇతర పరికరాలు అందజేశారు. దీంతో ఏఈఓలు వారి పరిధిలో నాలుగు సంవత్సరాల క్రితం పరీక్షలు నిర్వహించారు. తర్వాత ఏం జరిగిందో ఏమో కాని.. రసాయనాలు, ఇతర పరికరాలు ఇవ్వలేదు. దీంతో భూసార పరీక్షలు చేపట్టే కిట్లు అటకెక్కాయి.

పాత పరీక్ష కేంద్రాల్లో అంతంతే..

కొత్తగా ఏఈఓలకు అందజేసిన కిట్ల ద్వారా భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. ఇక పాత భూసార పరీక్షల కేంద్రాల్లో పరీక్షలు అత్యవసరం అయితే కానీ చేయరు. రైతులు తమ భూమి స్వభావాన్ని తెలుకోవాలంటే గతంలో వరంగల్‌, కేసముద్రం, కేవీకే మల్యాలో ఉన్న భూసార పరీక్ష కేంద్రాలకు మట్టి నమూనాలను తీసుకెళ్లేవారు. అక్కడ ఒక్కో శాంపిల్‌కు రూ.300 నుంచి రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇటీవల కాలంలో ఈ మాత్రం పరీక్షలు కూడా చేయడం లేదని రైతులు చెబుతున్నారు. ఆయా కేంద్రాల్లో సిబ్బంది, అధికారులు, శాస్త్రవేత్తలు లేకపోవడం, ఉన్నవారికి వేర్వేరు పనుల ఒత్తిడితో ఉండడంతో ఈ పరీక్షలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీనికి తోడు ఈ కేంద్రాల్లో కూడా సరిపడా రసాయనాలు లేవని అధికారులు అంటున్నారు.

మూస పద్ధతిలో సాగు..

భూసార పరీక్షలు చేయకపోవడంతో భూమిలోని పోషక విలువలు, పీహెచ్‌సీ, ఈసీ విలువలు తెలియడం లేదు. దీంతో ఏ పంట వేయాలో.. ఏ పంట వేస్తే ఎంత మోతాదులో ఎరువులు వేయాలో తెలియక రైతులు ఇష్టారాజ్యంగా ఎరువులు, పురుగు మందులు వేస్తున్నారు. వానాకాలంలో పత్తి, మిర్చి, మొక్కజొన్నతోపాటు వరి పంటల్లో అధికంగా ఎరువులు వాడారు. దీంతో పంటల దిగుబడి తగ్గిపోయింది. అదేవిధంగా పలుచోట్ల పంటల మార్పిడి కూడా చేయాల్సి ఉంటుంది. కానీ భూమి సారమే తెలియదు, సేంద్రియ ఎరువుల ఊసే లేదు. దీంతో ఉన్న కొద్దిపాటి కమతాల్లో వరుసగా.. పత్తి, లేదా మిర్చి వేసి దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు.



సీఎం సమీక్షలో కలెక్టర్‌, ఎస్పీ

మహబూబాబాద్‌: హైదరాబాద్‌లోని అంబేడ్కర్‌ సచివాలయంలో గురువారం సీఎం కేసీఆర్‌ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మానుకోట జిల్లా నుంచి కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ హాజరయ్యారు. కాగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సీఎం కేసీఆర్‌ దిశానిర్దేశం చేశారు.

విద్యార్థుల ప్రతిభ

- ఎంసెట్‌ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు

ఎసెంట్‌ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. గురువారం ఫలితాలు వెలువడగా జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు గోపాల కార్తికేయ, బొబ్బిలి రుశ్విత్‌ ఉత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, గురువులు, చదువుకున్న కళాశాలలకు మంచి పేరు తీసుకొచ్చారు.



గోపాల కార్తికేయ



తల్లిదండ్రులతో రుశ్విత్‌

మహబూబాబాద్‌ అర్బన్‌: మానుకోట జిల్లా కేంద్రంలోని అడ్వొకేట్స్‌ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోపాల శ్రీధర్‌ కుమారుడు గోపాల కార్తికేయ ఎంసెట్‌ ఫలితాల్లో 1,472వ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్‌(ఎంపీసీ) పూర్తి చేసి, అక్కడే కోచింగ్‌ తీసుకుని ఎసెంట్‌లో మంచి ర్యాంకు సాధించాడు. ఉత్తమ ర్యాంకు సాధించిన కార్తికేయను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రుశ్విత్‌కు 1,895 ర్యాంక్‌

కేసముద్రం: ఎంసెట్‌ ఫలితాల్లో ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన బొబ్బిలి మహేందర్‌రెడ్డి, కల్పన దంపతుల కుమారుడు రుశ్విత్‌ 1,895వ ర్యాంకు సాధించాడు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో చదివిన రుశ్విత్‌ పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10జీపీఏ సాధించాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ కాలేజీలో ఇంటర్మీడియట్‌(ఎంపీసీ) చదివి, వార్షిక పరీక్షల ఫలితాల్లో 988 మార్కులు సాధించాడు. అదే విధంగా జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో 5,289వ ర్యాంకు రాగా, గురువారం వెలువడిన ఎంసెట్‌ ఫలితాల్లో రుశ్విత్‌ 1,895 ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాము, తమ కుమారుడిని మొదటి నుంచి కష్టపడి చదివించామని తల్లిదండ్రులు తెలిపారు. చదువులో ప్రతిభ కనబర్చి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు రుశ్విత్‌ను అభినందించారు.

ఇల్లు ఒకటి.. ఓట్లు వంద!

12 ఇళ్లల్లో 1,504 ఓట్లు

- 15 ఓట్లకు పైగా ఉన్న ఆవాసాలు 1,693
- 20 ఓట్లకుపైగా ఉన్న 566 ఇళ్లలో 17,514 మంది ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల డబుల్‌ ఓట్ల తంతు..
- క్షేత్రస్థాయి సర్వేలో విస్తుపోయే వాస్తవాలు..
- తప్పుల తడకగా ఓటరు జాబితా
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాగుతున్న వడపోత



ఉమ్మడి వరంగల్‌లో మొత్తం ఓటర్లు, వివరాలు	
మొత్తం ఓటర్లు	27,75,844
పురుషులు	13,78,380
మహిళలు	13,97,121
ఇతరులు	343

సాక్షిప్రతినిధి, వరంగల్‌:

- హనుమకొండలోని రెండు డివిజన్లలో రెండిళ్ల నంబర్లపై 274 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు.. వేర్వేరు డివిజన్లలో ఉన్న ఆ రెండు ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఒక ఇంట్లో 18, మరో ఇంట్లో 22 మంది ఉన్నారు. మిగతా వారి కోసం ఆరా తీస్తే పనుల మీద వేరేచోటికి వెళ్లారని అక్కడున్న వారు సమాధానం చెప్పారు.
- వరంగల్‌లోని రెండు వేర్వేరు డివిజన్లలోని రెండిళ్ల నంబర్లలో 212 మంది ఉన్నట్లు జాబితాలో వెల్లడైంది. అధికారులు ఆయా ఇంటినంబర్ల ఆధారంగా వివరాలు సేకరించగా మొత్తం 31మంది ఉన్నట్లు తేలింది. మిగతా వారు ఏమయ్యారు? వాస్తవానికి, ఓటర్ల నమోదుకు అంత తేడా ఎలా ఉంది? అన్న విషయమై ఇప్పటికీ స్పష్టత లేదు.

... ఇలా ఉమ్మడి వరంగల్‌లో 12 ఇళ్లల్లోనే 1,504 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వడపోత మొదలెట్టారు. తెలంగాణ వ్యాప్తంగా తప్పుల తడకగా ఓటరు జాబితా ఉందని ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలనుంచి ఫిర్యాదులున్నాయి. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలో 12 ఇళ్లలో 1,504 మంది ఉన్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 100 ఓట్లకు పైగా ఉన్న ఇళ్లతోపాటు 15 నుంచి 20 మందికి పైగా ఉన్న ఆవాసాల్లో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు.

సవాల్‌గా క్షేత్రస్థాయి పరిశీలన..

ఓటరు జాబితా తప్పుల తడకగా మారడంతో క్షేత్రస్థాయి పరిశీలన బూత్‌ లెవెల్‌ అధికారులకు సవాల్‌గా మారింది. ఆరేడు మాసాల్లో సాధారణ ఎన్నికలు రానుండగా.. కీలకమైన ఓటరు జాబితాపై దృష్టి సారించిన ఎన్నికల సంఘం ఆరా తీస్తుండడంతో లోపాలు వెలుగు చూస్తున్నాయి. తప్పుల్లేని జాబితా తయారు చేసే క్రమంలో ఇప్పటికే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో.. రెండు, ఆపై ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగిన ఓటర్లను తొలగించారు. ఇదే క్రమంలో ఒకే ఇంటినంబర్‌తో పదులు, వందల సంఖ్యలో ఉండడంతో మరో వడపోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉమ్మడి వరంగల్‌ వ్యాప్తంగా మొత్తం 27,75,844 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 5న వెల్లడించిన తుది జాబితాలో తప్పులు కుప్పలు తెప్పలుగా జరిగినట్లు గుర్తించిన అధికారులు.. ఆ తప్పులను సవరించేందుకు వడబోత ముమ్మరం చేశారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్‌ జిల్లాల సరిహద్దున మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాలు ఉండడంతో ఏటా పనుల నిమిత్తం వస్తున్న కూలీలు, బంధువులను ఓటరు జాబితాలో చేర్పించినట్లుగా గుర్తించారు.

క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోంది

ఓటర్ల వివరాలపై క్షేత్రస్థాయిలో బూత్‌లెవెల్‌ అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నారు. ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువమంది ఉంటే ఆ వివరాలను సేకరిస్తున్నాం. ఒక్కో ఇంటి నంబర్‌పై కొన్నిచోట్ల 20 నుంచి 100 మందికి పైగా ఉండడం పైనా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాం. ప్రజలు బీఎల్‌ఓలకు సరైన వివరాలు చెప్పి సహకరించాలి. త్వరలోనే పరిశీలన పూర్తవుతుంది.

– వాసుచంద్ర, ఆర్డీఓ, హనుమకొండ

జిల్లాల వారీగా పదుల సంఖ్యలో ఓట్లు ఉన్న ఇళ్లు ఇలా..

జిల్లా	15 ఓట్లకు పైగా ఉన్న ఇళ్లు	ఓటర్లు	20కి పైగా ఓట్లున్న ఇళ్లు	ఓటర్లు	100కు పైగా ఓట్లున్న.. ఇళ్లు	ఓటర్లు
జనగామ	210	4105	57	1446	00	00
మహబూబాబాద్‌	281	7033	126	4345	05	653
వరంగల్‌	484	9956	130	3793	02	212
హనుమకొండ	491	10108	140	4034	02	274
భూపాలపల్లి	94	2335	40	1375	02	255
ములుగు	133	3568	73	2521	01	110

పోలీస్‌స్టేషన్‌ మెట్లెక్కిన విద్యాశాఖ ఉద్యోగులు?

మహబూబాబాద్‌ అర్బన్‌: జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు మద్యం తాగిన అనంతరం జరిగిన ఘర్షణ కారణంగా పోలీస్‌ స్టేషన్‌ మెట్లెక్కినట్లు సమాచారం. వారు బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్ల వారుజాము వరకు మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఒకరి చేతి బొటన వేలును మరొకరు కొరికారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి, కౌన్సెలింగ్‌ ఇచ్చి వదిలిపెట్టారు.

మరింత మెరుగైన వైద్యం

- జిల్లా ఆస్పత్రికి 43 మంది వైద్యుల కేటాయింపు
- మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు
- ఆస్పత్రికి పెరుగుతున్న రోగుల రద్దీ



జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి

నెహ్రూసెంటర్‌: మానుకోట జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్యం అందనుంది. ప్రభుత్వం ఆస్పత్రికి 43మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను కేటాయించింది. ఇప్పటికే 44 మంది రెగ్యులర్‌ డాక్టర్లు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. నూతనంగా 43మంది వైద్యుల రాకతో రోగులకు మరిన్ని వైద్య సేవలు అందుతాయి. కాగా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపడడంతో రోగుల రద్దీ పెరిగింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం గుండె సంబంధిత సమస్యలతో రోగులు ఎక్కువగా వస్తున్నారని, ఆ విభాగం వైద్యులను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

43 మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల రాక

జిల్లా జనరల్‌ ఆస్పత్రికి మరో 43మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను ప్రభుత్వం కేటాయించడంతో కార్పొరేట్‌ స్థాయి వైద్య సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు వివిధ విభాగాల్లో సేవలు అందుతుండగా అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల రాకతో అన్ని విభాగాల్లో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు అందుతున్న సేవలతో పాటు ప్రధానంగా గ్యాస్ట్రో, జనరల్‌ సర్జరీ, పీడియాట్రిక్‌, ఆర్థో, జనరల్‌ మెడికల్‌తో పాటు పలు విభాగాల్లో సేవలు విస్తృతం కానున్నాయి. 43మంది వైద్యులకు గానూ.. 13 మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు ఆస్పత్రిలో రిపోర్టు చేశారని అధికారులు తెలిపారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య..

ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. అన్ని రకాల వైద్య సేవలు అందుతుండడంతో జిల్లా కేంద్రంతో పాటు ఇతర మండలాలు, గ్రామాల నుంచి వైద్యం కోసం ఆస్పత్రికి వస్తున్నారు. ప్రతి రోజు రోడ్డు ప్రమాదాలు, పురుగ మందు తాగిన కేసులు, ఆపరేషన్లు, డెలివరీల కోసం వచ్చే రోగులకు, బాధితులకు వెంటనే వైద్య సేవలు అందుతున్నాయి.

మెరుగైన సేవలు అందుతాయి..



ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రికి అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను కేటాయించడంతో పేదలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ఆస్పత్రికి వైద్యులను కేటాయించినందుకు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌

సకాలంలో వైద్య సేవలు



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యం అందిస్తున్నారు. నూతన డాక్టర్ల రాకతో వైద్యం మరింత మెరుగుపడనుంది. ప్రైవేటు కంటే ప్రభుత్వ ఆస్పత్రి మెరుగ్గా ఉంది.

–కాటయ్య, మహబూబాబాద్‌

గుండె సంబంధిత వైద్యులను నియమించాలి



జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయి. దీంతో పాటు గుండె సంబంధిత వైద్యులను నియమించాలి. కాగా సంబంధిత వైద్యులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

– పల్లె సందీప్‌, మానుకోట

కల్తీ విత్తనాలతో జాగ్రత్తగా ఉండాలి

- ఏడీఏ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏఓ తిరుపతిరెడ్డి

మహబూబాబాద్‌ రూరల్‌: కల్తీ విత్తనాలతో రైతులు జాగ్రత్తగా ఉండాలని మహబూబాబాద్‌ ఏడీఏ లక్ష్మీనారాయణ అన్నారు. మహబూబాబాద్‌ మండలంలోని పర్వతగిరి, లక్ష్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బూరుకుంటతండా గ్రామంలో గురువారం ఆయన రైతులతో మాట్లాడారు. వానాకాలం సాగుకు రైతులు సిద్ధంకావాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ అనుమతి లేని మిర్చి విత్తనాలు రైతులకు అంటగడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు జాగ్రత్త పడాలని కోరారు. నకిలీ విత్తనాలు రైతులకు అమ్మినవారిపై పీడీ యాక్ట్‌ నమోదు చేయిస్తామని హెచ్చరించారు. రైతులు లైసెన్స్‌ ఉన్న డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి, బిల్లుల రశీదులు తీసుకోవాలన్నారు. రశీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలని రైతులకు ఏడీఏ లక్ష్మీనారాయణ సూచించారు. కార్యక్రమంలో ఏఓ నారెడ్డి తిరుపతిరెడ్డి, రైతులు వెంకన్న, విష్ణు, ధరావత్‌ కీమా, రాంధన్‌, జలందర్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదవులు ఇచ్చినా కుట్రలు మానట్లేదు

- రూ.3,220 కోట్లతో నియోజకవర్గానికి ‘సీతారామ’ నీళ్లు
- ఆత్మీయ సమ్మేళనంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

బయ్యారం: గత ఎన్నికల్లో తన ఓటమి కోసం పని చేసిన వారికి అధికార పార్టీలో చేరిన తర్వాత పదవులు ఇచ్చినా తనపై కుట్రలు మానట్లేదని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్‌ హరిప్రియ అన్నారు. మండలంలోని కంబాలపల్లిలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ప్రతిపక్షాలే గెలిచాయని, తానూ అలాగే గెలిచి ప్రజల కోసం బీఆర్‌ఎస్‌లో చేరినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన కనకయ్యకు బీఆర్‌ఎస్‌ సముచిత స్థానం కల్పించి భద్రాద్రి జెడ్పీ చైర్మన్‌ చేసినా ఆయన స్వార్థంతో పార్టీని వీడారని అన్నారు. కనకయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోళ్లపాడు నుంచి బయ్యారం చెరువు వరకు రావాల్సిన సీతారామ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చినా మౌనం వహించారని ధ్వజమెత్తారు. రూ.3,320 కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టు నీటిని నియోజకవర్గానికి తాను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. సింగరేణి ద్వారా అత్యధికంగా రూ.20 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులను బయ్యారం మండలానికి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తుంటే కొందరు సర్పంచ్‌లు తీర్మానాలు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్‌ ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజల ఆదరణతో రానున్న ఎన్నికల్లో తాను అత్యధిక మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టిస్తానని చెప్పారు.

టికెట్‌ ఎవరికిచ్చినా గెలిపించాలి..

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే హరిప్రియకు, లేదా ఆమె భర్త హరిసింగ్‌కు లేదా మరెవరికి టికెట్‌ ఇచ్చినా వారి గెలుపునకు చొరవ తీసుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్‌ ఆంగోత్‌ బిందు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా జెడ్పీ చైర్‌పర్సన్‌ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే స్పందించారు. వచ్చే ఎన్నికల్లో తనకే టికెట్‌ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మేళనంలో పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌, ఎంపీపీ మౌనిక, సొసైటీ వైస్‌ చైర్మన్‌ సత్యనారాయణ, ఎంపీటీసీ భద్రయ్య, సర్పంచ్‌లు లక్ష్మణ్‌రావు, సీతారాములు, వజ్జయ్య, నాయకులు సోమిరెడ్డి, ఐలయ్య, శ్రీను, ఉప్పలయ్య యాదవ్‌, సుగుణ, మురళీకృష్ణ, లక్ష్మణ్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

జనరల్‌ ఆస్పత్రిలో లిఫ్ట్‌ ఏర్పాటు

నెహ్రూసెంటర్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో నూతనంగా లిఫ్ట్‌ ఏర్పాటు చేశారు. రోగులు రెండు, మూడో అంతస్తులకు వెళ్లేందుకు వీలుగా లిఫ్ట్‌ ఏర్పాటు చేశారు. కాగా త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా లిఫ్ట్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టు కోచ్‌గా రఘువీర్



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) జలగం రఘువీర్ రాష్ట్ర బాలికల జట్టు వాలీబాల్ కోచ్‌గా నియమితులయ్యారు. ఈ నెల 28 నుంచి జూన్ ఒకటి వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేశ్‌బాబు, కార్యదర్శి హన్మంత రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కర్ణాటక, పూణే, సికింద్రాబాద్, రాజస్తాన్, కేరళలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో భూకబ్జా

- సీపీని ఆశ్రయించిన బాధితుడు

హసన్‌పర్తి: తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో భూమిని కబ్జా చేసిన ఇద్దరిపై కేసు నమోదు అయింది. పోలీసుల కథనం ప్రకారం.. గోపాలపురానికి చెందిన దూలం రాజేందర్‌కు అదే గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 139లో మూడు వందల గజాల స్థలం ఉంది. ఈ స్థలంపై రియల్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బైరి సురేందర్‌రెడ్డి కన్నుపడింది. వీరిద్దరు గోపాలపురం గ్రామానికి చెందిన ఓ భూస్వామి నుంచి సర్వే నంబర్ 138లో భూమి కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. ప్రస్తుతం 138 సర్వే నంబర్‌లో భూమి లేకపోవడంతో ఏకంగా 139 సర్వే నంబర్‌లో ఖాళీగా ఉన్న భూమిని కబ్జా చేశారు. దీంతో బాధితుడు రాజేందర్ సీపీ రంగనాథ్‌ను కలిసి తన గోడును తెలపగా కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా!

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గొర్రె నిహారిక, సుమన్ దంపతుల కుమారులు గొర్రె రిషి (11), రిత్విక్ (9) మడికొండ రాంపూర్‌లో జరిగిన బంధువుల పెళ్లికి అన్నదమ్ములు వచ్చారు. ఎండవేడి తట్టుకునేందుకు సరదాగా అన్నదమ్ములు కలిసి చెరువువద్దకు ఈతకు వెళ్లారు. లోతైన గుంతలో మునిగి మృత్యువాత పడ్డారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఇద్దరు కుమారులు చెరువులో పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన కరుడుపెల్లి విజయ్‌కుమార్(42) మంచిర్యాల ఈఎస్‌ఐ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. తన తోడల్లుడి కుమార్తె వివాహం కోసం డాక్టర్ విజయ్‌కుమార్ తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెరుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు విజయ్‌కుమార్ కుమార్తెలు వింధ్యశ్రీ, హిమజలతో పాటు బావమరిది కుమార్తెలతో కలిసి ఊర చెరువులో దిగి మునిగిపోతున్నారు. గమనించిన డాక్టర్ విజయ్‌కుమార్ హుటాహుటిన చెరువులో మునిగిపోతున్న ఇద్దరు పిల్లలను ఒడ్డుకు లాగేసి తాను మాత్రం నీటిలో మునిగి మృతి చెందారు.

- ఖిలా వరంగల్

- నిండుకుండల్లా చెరువులు, గుంతలు
- ఎండవేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసమే పరుగులు
- తల్లిదండ్రులు పిల్లలపై కన్నేసి ఉంచడమే మేలు
- ఈత సరదా ఒకేరోజు ముగ్గురిని మింగేసింది



వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి సెలవుల్లో సరదా కోసం ఈతకు వెళ్తున్న చిన్నారులు మృత్యువాత పడడుతుండటంతో కన్నవారికి పుత్రశోకం మిగిలుతోంది. ఎంతో భవిష్యత్ ఉన్న 10 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. చెరువు, గుంతల లోతు అంచనా తెలియకపోవడంతో గుంతల్లో కూరుకుపోవడంతోనే ఈ ఘటనలు జరుగుతున్నాయి.

ఈత నేర్చుకోవాలనే తపనతో..

గ్రామీణ ప్రాంతంలో చెరువులు, బావులు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు ఉక్కపోత నుంచి ఉపశమనం, వ్యాయామం కోసం చెరువులు, బావుల్లో స్నానాలకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈత కొట్టేందుకు విద్యార్థులు, యువత ఉత్సాహం చూపుతున్నారు. విపరీతమైన ఎండ సమయంలో ఈత కొట్టేందుకు సరదాగా తరలి వెళ్తున్నారు. ఈ సరదా ప్రాణాల మీదకు తెచ్చేలా ఉంటుండటం కలవరపెడుతోంది. ఈత కొట్టే ఉత్సాహంలో నీటిలో ఆడే ఆటలే అక్కడక్కడా మృత్యుగంటలై మోగుతున్నాయి. గురువారం ఒక్కరోజు ఇద్దరు పిల్లలు, ఓ డాక్టర్ తన పిల్లలను కాపాడి తాను నీటిలో మునిగి మృతి చెందారు.

సురక్షితమైన ప్రాంతంలో ఈత నేర్పించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పించాలంటే ఈత కొలనులో శిక్షణకు పంపించాలని, సెలవుల్లో ఇంటి వద్దనే చిన్న చిన్న పనులు చేసేలా ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే వంట పనులు, వ్యవసాయంపై అవగాహన కల్పించాలని, పోటీ పరీక్షలు, రైటింగ్, టైపింగ్, కంప్యూటర్, పెయింటింగ్ వంటి అంశాలపై శిక్షణ పొందే విధంగా చేయాలని పేర్కొంటున్నారు. దీంతో పిల్లలు బయటకు వెళ్లకుండా ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పిల్లలూ గుర్తు పెట్టుకోండి..

ఈత రాని పిల్లలు తప్పకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణలో రబ్బరు ట్యూబ్‌లను కట్టుకొని నీటిలోకి దిగాలి. బావులు, చెరువు గుంతల్లోకి దూకడం వంటివి చేయొద్దు. అనుభవజ్ఞులు ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. హెచ్చరిక బోర్డులున్న చోట అసలు నీటిలోకి దిగరాదు. లైఫ్ జాకెట్లు, బెండుతో తయారు చేసిన వస్తువులను కట్టుకుని మాత్రమే నీళ్లలో దిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

టీఎస్‌ఎంసెట్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం



జి.సాత్విక్ జి.బాలరాజు, ఎ.మణిదీప్‌రెడ్డి, పి.నర్మద

విద్యారణ్యపురి: టీఎస్‌ఎంసెట్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చూపి ప్రభంజనం సృష్టించారు. జి. సాత్విక్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు, జి.బాలరాజు బీపీసీ విభాగంలో 63వ ర్యాంకు, ఎ.మణిదీప్‌రెడ్డి ఎంపీసీ విభాగంలో 70వ ర్యాంకు, పి.నర్మద ఎంపీసీ విభాగంలో 71వ ర్యాంకు సాధించి ఎస్ఆర్ విజయపథాన్ని ఎగురవేశారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి గురువారం తెలిపారు. అలాగే ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన వి.దీక్షిత్‌రెడ్డి 153వ ర్యాంకు, మాకినేని సింగు 254వ ర్యాంకు, బి.నితిన్ 261వ ర్యాంకు, కె.ఆశ్రిత్‌రెడ్డి 278వ ర్యాంకు, వారణాసి సాయి సిద్దార్థ 296వ ర్యాంకు, రేణికుంట్ల ఐశ్వర్య 480వ ర్యాంకు, సిహెచ్ సోనిక 508 వ ర్యాంకు, కె.వీరేష్ 530వ ర్యాంకు సాధించారని వారు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ తమ విద్యాసంస్థల విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామన్నారు. గత 50 సంవత్సరాల్లో పటిష్టమైన ప్రణాళికలతో జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీల్లో విద్యను అందిస్తూ ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని వారు తెలిపారు.

ఎంసెట్ ఫలితాల్లో 'షైన్' విజయకేతనం

హన్మకొండ: ఎంసెట్ ఫలితాల్లో హనుమకొండలోని షైన్ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. తమ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించారని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని షైన్ జూనియర్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కేటగిరీలో అరె శ్రీవర్షిణి రాష్ట్ర స్థాయిలో 1,865 ర్యాంకు, డి.శ్రీజ 9,503 ర్యాంకు సాధించారని తెలిపారు. ఇంజనీరింగ్ కేటగిరీలో ఉగ్గె శ్వేత, టి.నిహారిక 5,185 ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు మెడికల్ కేటగిరీలో 20 మంది విద్యార్థులు 75, ఇంజనీరింగ్ కేటగిరీలో 30 మంది 75 పర్సంటైల్ మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగల రమ, మూగల రమేష్, ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



శ్రీవర్షిణిని అభినందిస్తున్న షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్

ఎంసెట్‌లో 'శివాని'కి ర్యాంకులు



ఎ.సుష్మిత ఎం.హారిక వి.భవాని కె.రిషిత టి.కార్తీక్

హసన్‌పర్తి: ఎంసెట్ ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆకునూరి సుష్మిత 1,559వ ర్యాంకు, మంద హారిక (3,186), భవాని వెంగళ (3,307), కె.రిషిత (3,869), ఎస్.అనూహ్య (5,047), టి.కార్తీక్ (5,775), బి.ప్రణతి (7,483), ఎల్. కల్యాణి (7,506), ప్రదీప్ (8,537), సౌమ్య (8,589), సింధూజ (8,678), కావ్యశ్రీ (9,035), అర్చన (9,162), అశోక్ (9,767), రాకేష్ (10,005), లక్ష్మీప్రసన్న (10,029), సాయి జ్యోస్మిత 10,815వ ర్యాంకు సాధించారని కళాశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, రమేష్, మురళీధర్, సురేష్, సంతోష్‌లు అభినందించారు.

'ఏకశిల' విద్యార్థినికి 1,306 ర్యాంకు

హన్మకొండ చౌరస్తా:ఎంసెట్ ఫలితాల్లో హనుమకొండలోని తమ విద్యార్థిని కె. సంధ్యాదేవి మెడికల్ అండ్ అగ్రికల్చర్ కేటగిరీలో 1,306 ర్యాంకు సాధించిందని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరంగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏకశిల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపక సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



కె.సంధ్యాదేవి

కేయూను సందర్శించిన న్యాక్ టీం



గౌరవ వందనం స్వీకరిస్తున్న న్యాక్ టీం చైర్మన్ సుగమ్, తదితరులు

కేయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) టీం సభ్యులు గురువారం కేయూలోని పలు విభాగాలు, కళాశాలలను సందర్శించి పరిశీలించింది. న్యాక్ పీర్ టీం చైర్మన్ ఉత్తరప్రదేశ్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుగమ్ ఆనంద్‌తో పాటు మెంబర్ కోఆర్డినేటర్ బెంగళూరు యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.హనుమంతప్ప, సభ్యులు వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల ఆచార్యులు డాక్టర్ పంకజ్ కె.శ్రీవాత్సవా, డాక్టర్ బులు మహారాణా, డాక్టర్ జయంతి సోన్‌వాల్కర్, డాక్టర్ సారికా శర్మ, డాక్టర్ సుజాత పీలా తొలుత గురువారం 11 గంటలకు క్యాంపస్‌కు చేరుకోగా వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు స్వాగతం పలికారు. అనంతరం పరిపాలన భవనం వద్ద ఎన్‌సీసీ కేడెట్లతో గౌరవ వందనం న్యాక్ టీం స్వీకరించారు. అక్కడ విజిటర్స్ బుక్‌లో న్యాక్ పీర్ టీం చైర్మన్ సుగమ్ సంతకం చేశారు. అనంతరం అకాడమిక్ కమిటీ హాల్‌లో వీసీ రమేశ్ కేయూలో విభాగాలు, కళాశాలలు గత ఐదేళ్లలో చేపట్టిన అకాడమిక్, పరిశోధనల పరంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



స్వాగత నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మూడు బృందాలుగా వీడి..

న్యాక్ టీంలో చైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు ఉండగా మూడు టీంలుగా విడిపోయి క్యాంపస్‌లోని బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, బాటనీ, ఫిజిక్స్, మైక్రో బయాలజీ, జీయాలజీ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, తెలుగు, ఇంగ్లిష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్ విభాగాలల్లో ఆయా విభాగాల అధిపతులు, ఫార్మసీ కళాశాల, విద్యా కళాశాలలో, కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, గణితశాస్త్రం విభాగం ఫిజిక్స్ విభాగాలల్లో అధిపతులు అకాడమిక్, పరిశోధనల పరంగా చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. దూర విద్యాకేంద్రాన్ని కూడా సందర్శించి పరిశీలించారు. అలాగే క్యాంపస్‌లోని లైబ్రరీని సాయంత్రం సందర్శించి నెట్‌వర్క్ పనిచేసే విధానాన్ని పరిశీలించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

క్యాంపస్‌లోని అడిటోరియంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వాగత నృత్యం, కూచిపూడి నృత్యం, పేరిణి, బతుకమ్మ, బోనాలతో నృత్యాలు అలరించాయి.

టీఎస్ ఐసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 8,476 మంది అభ్యర్థులు
- అమలులో ఒక్క నిమిషం నిబంధన
- ఈనెల 26, 27 తేదీల్లో నాలుగు సెషన్లలో నిర్వహణ
- కన్వీనర్ ఆచార్య పి.వరలక్ష్మి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం 2023–2024లో ప్రవేశాలకు గాను ఈనెల 26, 27 తేదీల్లో టీఎస్‌ఐసెట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి గురువారం తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కలిపి 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ఐయాన్ డిజిటల్ జోన్, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంట, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్, మాస్టర్జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, మోక్షిత కంప్యూటర్స్, వశిష్ట టెక్నాలజీస్, నర్సంపేటలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయి. నాలుగు సెషన్లలో మొత్తం 8,476 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 నుంచి సా యంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రానికి అనుమతించరు. అభ్యర్థులు ఫొటోగుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపాల్సి ఉంటుంది.

పాముకాటుతో రైతు మృతి

గూడూరు: పంట పొలంలో పాము కాటు వేయగా ఓ రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండెంగ శివారు సూర్యతండాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యతండాకు చెందిన భూక్య శంకర్ (42) భార్య విజయతో కలిసి పోడు వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వారికి ఒక కుమారుడు ఉండగా, కూతురు పెళ్లి జరిగింది. బుధవారం సాయంత్రం పంట చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లిన శంకర్‌ను పాము కాటు వేసింది. వెంటనే సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గూడూరు సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డెంగీ జ్వరంతో వ్యక్తి..



ఎల్లయ్య (ఫైల్)

ఖానాపురం: డెంగీ జ్వరంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ధర్మరావుపేటలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జినుకల ఎల్లయ్య(75) జ్వరం బారిన పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా డెంగీగా నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్ దంపతులు పరామర్శించారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని వృద్ధురాలు..



ఎల్లమ్మ మృతదేహం

మడికొండ: రెడీమిక్స్ వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మడికొండలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కుక్కల ఎల్లమ్మ (75) గురువారం మధ్యాహ్నం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా పక్కన సైడ్ డ్రెయినేజీ కాల్వ నిర్మాణ పనులు జరుపుతున్న రెడీమిక్స్ వాహనం రివర్స్ తీస్తుండగా వృద్ధురాలిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎల్లమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి మనువడు కుక్కల సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింగరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కారును ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు బుధవారం మృతిచెందగా తీవ్రగాయాలతో వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న దేవరపల్లి జీవన్‌బాబు(51) గురువారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తండ్రి, కుమార్తె మృతిచెందారు. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరపల్లి జీవన్‌బాబు కువైట్ దేశంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సెలవుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ క్రమంలో వారి ఇంటిలో పనిచేసే పనిమనిషి కుమారుడు వివాహం రాయపర్తి మండలం పెరికేడులో ఉండగా భార్య, కుమార్తెతో కలిసి వివాహానికి హాజరై తిరిగి తమ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మీదికొండ క్రాస్‌రోడ్డు సమీపాన దాబా హోటల్‌కు వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటుండగా ఆర్టీసీ రాజధాని బస్సు ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో జీవన్‌బాబు భార్య వసుంధరదేవి, వారి కుమార్తె నేహారామ్ మృతిచెందగా, తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ జీవన్‌బాబు గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు దేవరపల్లి మోహన్‌రాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళా ఉద్యోగిపై దాడికి యత్నం

గూడూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళా ఉద్యోగిపై వెనకాల ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి దాడికి యత్నించినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు సీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న ప్రభావతి ప్రతిరోజు ద్విచక్ర వాహనంపై నెక్కొండ నుంచి వస్తూ విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని బైక్‌పై వెళ్తున్న ప్రభావతి మండలంలోని అయోధ్యపురం శివారు బోడగుట్ట ప్రాంతంలో వెనకాల ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ప్రభావతి బైక్‌ను ఢీకొట్టగా కింద పడింది. అనంతరం ఆమెపై దాడి చేసే ప్రయత్నం చేస్తుండగా అదే దారి గుండా వెళ్తున్న గుండెంగకు చెందిన దేవేందర్ అనే వ్యక్తి జరుగుతున్న సంఘటనను గుర్తించి అగంతకుడిని ప్రశ్నించే ప్రయత్నం చేశాడు. దీంతో అతను బైక్‌పై పారిపోయాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు, తోటి ఉద్యోగులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం ప్రభావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.